

# అమెరి "కమర్షియల్" కామెడి
## వంగూరి చిట్టెన్ రాజు



## నేనూ-ముళ్ళపూడి గారూ...అనగా నక్కా-నాకలోకమూ

2

అప్పుడేమో ఆయనకి 14 యేళ్ళ వయసు. బాపూకి పన్నెండు. ఆయనేమో "అమ్మ మాట వినకపోతే" అని ఒక చిన్న కథ వ్రాశారు. అది "బాల" పత్రిక 1945 ఆగస్టు నెల సంచికలో ప్రచురించబడింది. అప్పుడు నా వయసు మూణ్ణెల్లు. ఆ తరువాతేమో బాపు గారి మొట్టమొదటి బొమ్మ "బాల" పత్రికలోనే 1946, జూలై సంచికలో ప్రచురించబడింది. అప్పుడు నా వయసు మూణ్ణెల్ల కంటా "కుంచెం" ఎక్కువే. అదిగో అప్పటినుంచీ వాళ్ళిద్దరూ నాకు తెలుసు.

ఎందుకంటే, తెలుగు చదవడం కాస్తో కూస్తో వచ్చిన కోటానుకోట్ల తెలుగు వారు హాయిగా నవ్వుకోడానికీ, శృతి మించని వ్యంగానికీ, ఎంతో ఆహ్లాదకరమైన సాహిత్య వాతావరణాన్ని తెలుగు నాట సృష్టించడానికి రమణ రాత-బాపు గీత మారు పేరుగా మారిపోయింది. వారిద్దరూ సృష్టించిన ఆ అద్భుతమైన వాతావరణంలో పెరిగిన కోటానుకోట్ల మందిలో నేనూ ఒకణ్ణి. అఫ్ కోర్స్, నాకు వారు చిన్నప్పటి నుంచి "తెలుసు" కానీ, వారిద్దరికీ నేను చాలా ఏళ్ళు అస్సలు తెలీదు. కేవలం సుమారు పాతికేళ్ళగా నేను బాగానే తెలుసును.

1987లో నా పూర్వ జన్మ సుకృతం వలన ఒక రోజు బాపు గారిని భయం, భయంగానే పిలిచాను. ఎందుకంటే, మా హ్యూస్టన్‌లో తలపెట్టిన సప్తమ తానా మహా సభల సావనీర్ "మధురవాణి" కి నన్ను సంపాదకుడిగా పెద్దలు నియమించారు. అది తెలియగానే నా బుర్రలో వెలిగిన మొట్టమొదటి పేరు బాపు-రమణ. అవి రెండు పేర్లు అని ప్రపంచంలో ఆ రోజుల్లోనే ఎవరికీ తెలియదు. ఆ ఫోన్ ఎత్తి, హలో అన్నది సాక్షాత్తూ బాపూ గారే అని తెలియగానే నాకు ముచ్చెమట్లు పట్టేసి, అనుకోకుండానే కుర్చీలోంచి లేచి నుల్చుని మాట్లాడడం మొదలు పెట్టి "అయ్యా, మాది అమెరికాలో టెక్సస్. ఊరి పేరు హ్యూస్టన్. ఇక్కడ భారీ ఎత్తున మేము తెలుగు సభల జరుపుకుంటున్నాం" అని గబ గబాగా వాగేయగా ఆయన "సభలా? అందులోనూ అమెరికాలోనా? నేను రాను" అని ఫోన్ పెట్టెయ్యబోతుంటే, నేను బుడుగు కంటే ఘాటిగా, "మాకు అట్ట మీద అద్భుతమైన బొమ్మ కావాలి" అని అరిచాను. ఆ అరుపేదో ముందే అరవచ్చుగా అనకుండా, "ఆ ఏడుపేదో ముందే ఏడవచ్చుగా" అనే ధోరణిలో మాట్లాడకుండా బాపుగారు చల్లబడ్డారు. బాపు గారు భగ్గుమనడం, అరక్షణంలో చల్లారిపోవడం ఆ తరువాత నేను ప్రత్యక్షంగానే చూశాను.

"సరే, బొమ్మ వేస్తాను, ఎలాంటి బొమ్మ కావాలీ?" - అని అడిగారు బాపూగారు. "అంటే, మీకు పండగలూ, గుళ్ళూ గోపురాలూ, దెయ్యాలూ, భూతాలూ కావాలా? చీర కట్టుకున్న లిబర్టీ అమ్మాయి కవరు మీద ఉండాలా?" మొదలైన ప్రశ్నలు అడిగి నా అభిప్రాయాలు తెలుసుకుని, ఎప్పటికి కావాలో కనుక్కున్నారు.

అదే అవకాశం కదా అని "సార్, మా మధుర వాణికి రమణ గారి చేత ఏమైనా మంచి ఆర్టికిల్ రాయించి పెట్టగలరా?" అని అడిగాను.

"ఇదిగో, ఆయన్నే అడగండి. మధ్యలో నా రికమండేషన్ ఎందుకూ?" అని బాపూ గారు ఫోన్ రమణ గారికిచ్చారు. నా జన్మలో మొట్టమొదటి సారిగా బాపు గారి గొంతుక విన్న పది నిముషాలలో "హలో, ఎలా ఉన్నారు?" అని రమణగారి గొంతుక కూడా వినడం కూడా నా జన్మలో మొట్టమొదటి సారి. వెను వెంటనే ఇంకా భయం, భయంగా, నెర్వస్‌గా నేను కుర్చీకూడా ఎక్కేసి ఫోన్‌లో మాట్లాడడం కూడా నా జన్మలో మొదటి సారే!

కాస్సేపు "హలో, కులాసా" కబుర్లు చెప్పుకున్నాక, నా పూర్తి పేరు అడిగి తెలుసుకున్న రమణగారు "ఈ పేరు ఎక్కడో విన్నానే?" అన్నారు. నేను ఆశ్చర్యపోయాను. నక్కకీ, నాకలోకానికీ కనెక్షన్ ఎక్కడా అనుకుంటూ.

"మీరు ఎప్పుడైనా నాటకాలు వ్రాసి నాకు పంపించారా?" అడిగారు ముళ్ళపూడిగారు. అప్పటికి నేను ఏడో, ఎనిమిదో నాటకాలు వ్రాసినా అవి ఆయనకి ఎప్పుడూ పంపించ లేదు. కానీ ఆ క్షణంలో నాకు ఒక విషయం జ్ఞాపకం వచ్చింది. అదేమిటంటే, 1968లో నేను వ్రాసిన నా మొట్టమొదటి నాటకం "బామ్మాయణం అను సీతా కల్యాణం" హైదరాబాదులో మా బావగారు చదివి, ఇది ముళ్ళపూడి రమణకి పంపించి అభిప్రాయం వ్రాయమని అడుగుదాం" అన్నారు. మా బావగారు మద్రాసు కేసర్ హైస్కూల్లో బాపు-రమణల సహాధ్యాయి. బహుశా మా బావగారు నిజంగానే నా నాటకాన్ని ముళ్ళపూడిగారికి పంపించి ఉంటారని అప్పుడు తెలిసింది. ఎప్పడో ఇరవై ఏళ్ళ నా నాటకం మీకు ఎలా గ్నాపకం ఉంది గురువుగారూ అంటే, "నాటకం కాదు, నీ పేరు ఫన్నీగా ఉంది, పైగా ఆ తర్వాత కూడా అక్కడా, ఇక్కడా నీ పేరు చూశాను, అందుకూ" అన్నారు రమణ గారు. మొత్తానికి రమణ గారు మా "మధుర వాణి"కి రాయక పోయినా, బాపు గారు ఒక అద్భుతమైన ముఖ చిత్రమూ, పతాక శీర్షికా పంపించారు. నాకు తెలిసీ అమెరికా సావనీర్లకి బాపు గారు బొమ్మ వెయ్యడం అదే మొదటి సారి.

రమణగారి అసలు పేరు వెంకట్రావ్ అని అందరికీ తెలుసు. కానీ నాకు ఎలా తెలిసిందీ అంటే, నేను ఒకసారి ఇండియా వెళ్ళినప్పుడు నా "పుణ్య క్షేత్రాల యాత్ర"లో భాగంగా మద్రాసులో బాపుగారి ఇంటికి వెళ్ళాను. తన కొడుకులు ఇద్దరినీ చూడడానికి ఇండియానుంచి వచ్చి, హఠాత్తుగా లాస్‌ఏంజెలెస్‌లో, రమణ గారి కంటే కొన్ని రోజుల ముందే పరమపదించిన మా చిన్నన్నయ్య ప్రభాకర మూర్తిరాజు గారి మూడో కొడుకు, మమ్ము కూడా నాతో బాటు ఉన్నాడని గుర్తు. తన ట్రేడ్ మార్క్ నవ్వుతో మమ్మల్ని లోపలికి ఆహ్వానించి సోఫాలో కూచోబెట్టి, బాపు గారు ఫోన్ తీసుకుని డయల్ చేసి "వెంకట్రావ్, ఆయనొచ్చారు" అన్నారు. బాపు గారితో మాట్లాడదామని వస్తే, ఈ వెంకట్రావ్ గోల ఏమిటీ" అని నేను వెర్రి మొహం పెడదామని అనుకుంటూ ఉండగానే, మూడు నిముషాలలో సదరు వెంకట్రావ్ గారు "పైనించి దిగి వచ్చారు". ఆయనే ముళ్ళపూడి వెంకట రమణగారు అని తెలియగానే....నా గుండె మరింత స్పీడుగా కొట్టుకుంది. ఆనందం రెట్టింపు అయింది. ముళ్ళపూడి గారు పై అంతస్థులోనూ, బాపుగారు క్రిందా ఉంటారనీ తెలుసు, దానికి కారణాలూ చూచాయగా నాకు తెలుసు కానీ, ప్రత్యక్షంగా చూడడం అదే మొదటిసారి. ఆ రోజు ముగ్గురం చాలాసేపు అమెరికా విషయాలూ, కొంచెం ఆంధ్రా విషయాలు మాట్లాడుకున్నాం.

ఆ తరువాత కొన్నేళ్ళ తరువాత నేను ఆయనకి ఎందుకో అమెరికా నుంచి ఫోన్ చెయ్యగానే, " ఎలా ఉన్నారు సారధి గారూ అన్నారు" ఆయన.

"అదేమిటి సార్, నా పేరు అప్పుడే మర్చిపోయారా? నా పేరు సారధి కాదు సార్" అన్నాను.

"సారధి కాదయ్యా, వారధి" అన్నారు ముళ్ళపూడి గారు.

"అయితే నన్ను కోతి మూకలో చేర్చారన్న మాట" అని నేను చమత్కరించినప్పుడు, ముళ్ళపూడిగారు చిరునవ్వు నవ్వుతూ "వారధి అంటే తమిళనాడుకీ శ్రీలంకకీ కాదయ్యా.....నీది సాహిత్య వారధి. దానికి రాళ్ళూ, రప్పలూ అక్కర్లేదు. అక్కడ కథలు ఇక్కడ ప్రచురించి, సినిమా తారలు కాకపోయినా ఇక్కడి రచయితలని అక్కడికి పిలిచి మీరు అమెరికాకీ ఇండియాకీ వారధి కడుతున్నారు కదా, అందుకూ? అన్నారు ముళ్ళపూడి గారు. " అన్నారు. ఈ జన్మకి నాకు ఆ ప్రతిస్పందన చాలు.

1996 లో బాపుగారు హ్యూస్టన్ వచ్చినప్పుడు తను వేసిన ముప్ఫై తిరుప్పావై రంగుల బొమ్మలు నాకు ఇచ్చి, "ఇవి శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రుల వారి కోరిక మీద, ఆయన రచించిన తెలుగు తిరుప్పావై ముప్ఫై పాశురాలలో, ప్రతీ ప్రాశురానికీ ఒక్కొక్క వాక్యం స్ఫూర్తిగా ఈ బొమ్మలు వేశాను. అనుకోకుండా ఆయన పోయారు. కానీ ఈ బొమ్మలతో, ఆయన వ్రాసిన తిరుప్పావై మీ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ద్వారా ప్రచురించగలరా" అని అడిగారు. ఆయన మాట శిరసా వహించి, ఆ "తిరుప్పావై" పుస్తకాన్ని 1998లో మేము నిర్వహించిన "మొట్ట మొదటి అమెరికా తెలుగు సాహితీ సదస్సు"లో విడుదల చేశాం.

ఆ తిరుప్పావై పుస్తకానికి ముళ్ళపూడివారు అద్భుతమైన ఎనిమిది పేజీల పరిచయ వాక్యాలు వ్రాశారు. అది చదవానే నేను ఆనందం, ఆవేశం పట్టలేక ఆయనకి ఫోన్ చేసి "చాలా గొప్పగా వ్రాశారు గురువు గారూ" అని ప్రశంసించబోతుంటే, ముళ్ళపూడి గారు "అది వ్రాయడానికి ఎంత కష్టపడ్డానో నీకేం తెలుసయ్యా. పది, పదిహేను మంది పండితులని మా ఇంటికి పిలిచి, కాఫీలూ, టిఫిన్లు ఇచ్చి, ఈ సబ్జెక్టు మీద మాట్లాడించేసి, నోట్సు రాసేసుకుని, కాపీ కొట్టేశాను" అన్నారు.

ముళ్ళపూడిగారి లాంటి నిజమైన గొప్పవాళ్ళు తమ గొప్పతనాన్ని కూడా ఇతరులకే ఆపాదిస్తారు అనడానికి ఇది ఒక ఉదాహరణ.

దీనికి ముగింపు ఏమిటంటే ఆ తిరుప్పావై పుస్తకం ఏ మాత్రం బాగా ప్రింట్ అవలేదు. ఒక చారిత్రాత్మకమైన పుస్తకాన్ని అస్తవ్యస్తంగా ప్రచురించి దాన్ని నిజంగానే "కలెక్టర్స్ ఐటెం"గా ఎలా ప్రచురించవచ్చో నేను "నిరూపించాను". ఎందుకంటే, ఆ పుస్తకం కాపీ వారు చూసిన వెంటనే నాకు ఒక ఈ మెయిల్ వచ్చింది "God Bless you for bringing out Tiruppavai. God save the printer & binder" -Signed BAPU-RAMANA. 2006 లో మా అనుబంధం ఇంకా బలపడింది. ఆ ఏడు నా మొట్టమొదటి పుస్తకం "అమెరికామెడీ కథలు" జూలైలో ప్రచురించాం. ఆ పుస్తకం ప్రచురిద్దాం అని అనుకున్న అరక్షణంలో బాపుగారినీ, రమణగారినీ ముచ్చటగా మూడు కారణాలకి పిలిచాను. మొదటిది, ఆ పుస్తకం వారిద్దరికీ అంకితం ఇవ్వడానికి వారి అనుమతి పొందడానికి. రెండోది బాపుగారిని ముఖచిత్రం వెయ్యమని అర్థించడానికి. మూడోది ఆ పుస్తకానికి ముందు మాట వ్రాయమని విన్నవించుకోడానికి.


అన్నీ విని రమణ గారు "బిల్లు ఎంతా?" అన్నారు, " అంకితానికి ఎంతా? ముందు మాటకి ఎంతవుద్ది? బాపు బొమ్మకెంతవుద్దీ, అన్నీ కలిపి హోల్ సేల్ కి ఎంతా? కన్సెషన్ ఏమన్నా ఉందా" అనే పద్ధతిలో.

అయన ఏ దృష్టితో అన్నారో నాకేం తెలుసూ. అందు చేత "ఏమో, గురువు గారూ, మొత్తం పుస్తకం వెయ్యడానికి లక్ష రూపాయలు అవుతుందేమో?" అన్నారు.

"అది కాదయ్యా, మేము అంకితం పుచ్చుకుంటే, నీ కెంత ఇవ్వాలీ అని నా కొశ్చెను. ఏదైనా పుచ్చుకున్నప్పుడు ప్రతిఫలం ఇవ్వాలి కదా" అని చమత్కరించారు రమణ గారు.

కానీ, ఏ విధమైన ప్రతి ఫలమూ అడక్కుండా, ఆశించకుండా, కేవలం నా మీద అభిమానం కొద్దీ ముళ్ళపూడి రమణగారు అద్భుతమైన ముందు మాట రాసిచ్చారు. దాన్ని బాపు గారు స్వదస్తూరీతో వ్రాసి పంపించారు. అందులో కొంత భాగం ఈ క్రింద యదాతథంగా మీ ముందు ఉంచుతున్నాం.

అలాగే బాపు గారు చార్లీ చాప్లిన్ గెటప్‌తో నన్ను చిత్రీకరిస్తూ అట్ట మీద బొమ్మ గీసి అద్భుతంగా గీసి పంపించారు. ఇక్కడొక చిన్న పిట్ట కథ చెప్పాలి. బాపు గారు ఈ బొమ్మ వెయ్యడానికి బహుశా రెండేళ్ళ ముందు వారింటికి వెళ్ళినప్పుడు నేను ఒక రంగు రంగుల పువ్వుల చొక్కా వేసుకుని వెళ్ళాను. వారి నేల మీద కూచుని బొమ్మలు వేసే గదిలో చాలా సేపు కూచుని కబుర్లు చెప్పుకున్నాం. ఆ గదిలో ఒక మూల గోడ మీద చార్లీ చాప్లిన్ ఒక కాలు విసురుతూ, చేతి కర్రతో, టోపీ తీస్తూ ఉన్న భంగిమలో ఒక క్లాసిక్ ఫొటో ఉంటుంది. అది చూసి చార్లీ చాప్లిన్ మీద ముచ్చటగా, మూడే మాటలు మాట్లాడుకున్నాం. అది జరిగిన కొన్ని సంవత్సరాలకి, బాపూ గారు అదే చార్లీ చాప్లిన్‌కి, ఆ నాడు నేను వేసుకున్న అవే రంగులతో ఆ చొక్కాని, తొడిగి, చాప్లిన్ మొహం బదులు నా మొహం వేసేసి, మన ధోవతీ కట్టేసి. నా "అమెరికామెడీ కథలు" పుస్తకానికి కవర్ పేజీ బొమ్మ వేశారు. That is Bapu


ఏకుళ్ళంటె మేకుళ్ళంటె బాకుళ్ళంట
జోకులతో చెంపగులగొట్టేన్ రాజు
నవ్వించి నా పొంటె కొల్లగొట్టేన్ రాజు
నేను చెప్పేది నవ్వుమీద ఒట్టేన్ రాజు
అందుకే బాపు గీత రమణ రాత
వేసిపెట్టేన్ నేడు - జై బొట్టేన్ రా-రాజు -
బాపు - రమణ - 10.7.06

ఈ బొమ్మా, రమణ గారి ముందు మాటా అందే ముందు మూడు నాలుగు వారాలూ ఎలాంటి బొమ్మ వేస్తారా, ఎలాంటి ముందు మాట వ్రాస్తారా అని అంతుపట్టని కుతూహలంతో, ఉత్కంఠతో ప్రాణాలు ఉగ్గబట్టుకున్న నాకు బాపు-రమణలు నిజంగానే నా కథలకి ప్రాణపతిష్ఠ చేసి, రచయితగా నా ప్రతిష్ఠని శిఖరాగ్రాన్న నిలబెట్టారు. ఆ కథల పుస్తకం తెలుగు నాట పదిహేను నగరాలలోనూ, మద్రాసులో మాలతీ చందూర్ గారి చేతా ఆవిష్కరించబడిన ప్రతీ చోటా, అందరూ నా కథల కంటే బాపు-రమణల రాత-గీతల యోగ్యతా పత్రల గురించే ఎక్కువ మాట్లాడుకున్నారు. అది నాకు ఒక రిలీఫ్ గా ఉండి, మహా సంతోషాన్ని కలిగించింది.

అంతటి అభిమానాన్ని నామీద చూపించిన వారికి ఎన్ని జన్మలు ఋణపడి ఉంటానో అప్పారావుకే తెలియాలి. ఎందుకంటే, అప్పుల అప్పారావు ఒక ప్రధాన పాత్రగా నేను వ్రాసిన "యమ సభ" నాటకాన్ని ఎప్పుడు, ఎక్కడ చదివారో నాకు తెలియదు కానీ, ఏదో మాటల సందర్భంలో ముళ్ళపూడి గారు "ఆ అప్పారావు నువ్వే వేశావా?" అని అడిగారు.

"అవును సార్, ఏం బావుండదా?" అన్నాను భయం, భయంగా. "అబ్బే, నీ బాడీ లాంగ్వేజ్ అప్పారావు కేరక్టర్‌కి బానే ఉంటుంది" అన్నారు ఆ మహానుభావులు.

అదే విధంగా, నాకు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి తెచ్చి పెట్టిన "అసలు ప్రశ్న" అనే నాటకం బాపు-రమణలకి వీడియో పంపించాను, కానీ వారు నిజంగా అది చూస్తారని అని నేను అనుకోలేదు. కానీ, మనం అనుకోనివి అప్పుడప్పుడూ జరుగుతూ ఉంటాయి. "మీ నాటకం చాలా నిజాయితీగా ఉంది" అనే వారి అభిప్రాయం అందుకోవడం ఒకటి. ఎందుకంటే ఆ నాటకం చూసిన వేలాది మంది అభిప్రాయం "చాలా హాస్యంగా ఉంది, ఒక అమెరికా సామాజిక సమస్యని తెరమీదకి తెచ్చారు, అందరూ బాగా నటించారూ..." మొదలైన తరహాలో ఉంటే బాపు-రమణల ఈ అభిప్రాయం నన్ను చాలా ఆశ్చర్య పరిచింది. దానికి కారణాలు తరవాత అడిగి తెలుసుకున్నాను అనుకోండి. అది వేరే విషయం. ఆ నాటకంలో అన్ని నిజాయితీ అంశాలు నేను వ్రాసినట్టు నాకే తెలియదు.

ఆ ఏడు..అంటే 2006 అక్టోబర్ లో హ్యూస్టన్ లో జరిగిన "ఐదవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు" కు బాపు-రమణ లని ముఖ్య అతిథులుగా ఆహ్వానించి వారికి జీవిత సాఫల్య పురస్కారం బహూకరిద్దామని మా ఆలోచన. ఆ సదస్సు అంశం "సాహిత్యంలో

హాస్యం". సభలూ, సత్కారాలూ బొత్తిగా వారికి కిట్టవనీ, ఇది నేను మామూలుగా ఫోన్‌లో పిలిస్తే "ఇదేదో అర్రీ బుర్రీ గా తేలే యవ్వారం" కాదు కాబట్టి, స్వయంగా మద్రాసులో వారింటికి వెళ్ళి వారిద్దరినీ "బతిమాలుకుంటే" మా కోరిక తీరే అవకాశం కొంతైనా ఉంటుందనీ, వారింటికి వెళ్ళాను. ఏ కళని ఉన్నారో బాపు గారు "నువ్వు పిలుస్తున్నావు కాబట్టి సరే" అన్నారు. రమణ గారు మటుకు "నువ్వు నన్ను ఎత్తుకుని మొయ్యగలవా అన్నారు?" నవ్వుతూ.

"అదేమిటి సార్" అన్నాను విషయం అర్థం కాక.

"అదేలే, మీ అమెరికా ఇళ్ళలో గెస్ట్ బెడ్ రూములు ఎక్కడో రెండో అంతస్థులో ఉంటాయి. నేనేమో ఆ మెట్లు ఎక్కలేను. ఒక వేళ నువ్వు కష్టపడినా, నాతో బాటు నువ్వు కూడా కింద పడతావు. ఎందుకూ అంత ఇది" అంటూ రమణగారు రాలేనన్నారు.

ఆ సదస్సులో బాపు గారికి అనుకున్నాట్టుగానే లైఫ్ టైం ఎఛీవ్‌మెంట్ అవార్డు ఇచ్చాం. అప్పటి 12 సంవత్సరాల చరిత్రలో, ఎవార్డుల మీద ఆట్టే నమ్మకం లేని వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఇచ్చిన మొట్టమొదటి ఎవార్డు అదే! ఈ ఎవార్డు సమయంలో జరిగిన గొప్ప విషయం బాపు గారి స్పందన. బాపు గారు సభలలో ఎప్పుడూ మాట్లాడరు. ఎందుకంటే, తనకి "సభాకంపం, జన గండం" ఉందని సభాముఖంగా ప్రకటించి, "అందాల రాముడు రాజ్ బాబు అన్నట్టు నాకు తెలుగే రాదు, సంస్కృతం నిల్లు. అందు చేత నాకేం తోచక ఇద్దరి తరఫునా -సాహిత్యం అంటే మైత్రి ఉంది కదా ఏదైనా చెబితే రాసుకుని చదువుతాను అని రమణ గారిని అడిగాను" అని ముళ్ళపూడి గారు వ్రాసి ఇచ్చిన ప్రసంగ వ్యాసాన్ని డా. పప్పు వేణుగోపాల రావు చేత చదివించారు.

2006లో ఆ సదస్సులోనూ, మొన్న ఫిబ్రవరి 25, 2011 నాడు మా హ్యూస్టన్ సాహితీ లోకం వారు నిర్వహించిన "ముళ్ళపూడి వారి సంస్మరణ" సభలో నేను చదివినప్పుడు మాత్రమే ముళ్ళపూడి వారి వ్యాసాన్ని విన్నవారు. ఇప్పటి వరకూ అముద్రితమైన ఆ ప్రసంగ వ్యాసాన్ని మొట్టమొదటి సారిగా ఈ పత్రిక వారు మరొక చోట ప్రచురించారు. ముళ్ళపూడి వారి రచనాశైలికి ఈ వ్యాసం మరొక మచ్చు తునక.

2006లోనే నా జీవితంలోనూ, బాపు-రమణల జీవితంలోనూ, ఆ మాటకొస్తే తెలుగు సాహిత్య చరిత్రలోనూ మరొక అపురూపమైన సంఘటన జరిగింది. ఇది ఏ కోశాన్నా అతిశయోక్తి కాదు. నా "అహంభావం" అంతకన్నా కాదు.

ఆ సంవత్సరం ఆఖరి రోజు, (డిశంబర్ 31, 2006), మరియు మరుసటి సంవత్సరం మొదటి రోజు (జనవరి 1, 2007) తేదీలలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు హైదరాబాదులో జరిగింది. "తెలుగు భాషా చరిత్రలో నవ చైత్యానికి నాంది పలికిన సభలు" అనీ, "బాపు -రమణలు మైత్రీ బంధానికే మారు పేరు. వారి స్నేహబంధానికి అరవై ఏళ్ళు నిండిన షష్టి పూర్తి గురించి మనం మర్చిపోయాం. కానీ వంగూరి ఫౌండేషన్ వారు మర్చిపోలేదు. ఈ అపురూప సంబంధాన్ని పురస్కరించుకుని, వారిద్దరినీ దంపతీ సమేతంగా సత్కరించారు. తెలుగు చరిత్రలో ఇదొక అపూర్వ ఘట్టం" అని ఈటీవీ వారు తమ ప్రత్యేక ప్రసారంలో వ్యాఖ్యానిస్తూ, 30 నిముషాల ప్రత్యేక ప్రసారం చేశారు.

ఆ సదస్సులో ప్రత్యేక అతిథులుగా బాపు గారు, ఆయన సతీమణి భాగ్యమతి గారు, ముళ్ళపూడి గారు, ఆయన సతీమణి శ్రీదేవి గారు రెండు రోజులూ పూర్తిగా పాల్గొన్నారు. వారు నలుగురూ ఒకే వేదిక పైన కనపడడం అదే మొట్టమొదటి సారి.

ఈ చారిత్రాత్మక సదస్సు పూర్తి విశేషాలూ, ఈటీవీ వారి పూర్తి ప్రసారం ఈ కౌముది సంచికలోనే http://koumudi.net/vanguri/psadassu_sum_up.htm అనే లింకులో చూడవచ్చు. ఇవన్నీ "వివిధ సదస్సుల చిత్ర మాలికలు" అనే కౌముది విభాగంలొ ఉంటాయి.

భాపు-రమణల మైత్రీ షష్టి పూర్తి మహోత్సవాన్ని యధాతధంగా త్వరలోనే You Tube లో పెడతాం. అందులో డా. సి. నారాయణ రెడ్డిగారి ప్రసంగం అందరూ విని తీరవలసిందే!

ఆ సదస్సులోనే రచన సాయి గారు ప్రచురించిన బాపు గారి బొమ్మలతో " ముళ్ళపూడి వెంకట రమణ బొమ్మల కథలు" అనే 500 పేజీల అపురూపమైన బృహత్ గ్రంధాన్నీ, ముళ్ళపూడి వారి "రమణీయ భాగవత కథలు" పుస్తకం ఆవిష్కరించబడ్డాయి. బాపు-రమణల జంట షష్టిపూర్తి నిర్వహించాలనే ఆలోచన, సలహా కూడా రచన సాయి గారిదే!

ఈ అపురూప సన్మానానికి వారి ప్రతిస్పందినలో బాపుగారు యధాప్రకారం నమస్కారం మాత్రమే పెట్టగా, రమణగారు మాట్లాడుతూ "ఈ అరవై ఏళ్ళ ప్రయాణంలో నాకు అర్థమయిందేమిటంటే, ఇదేమీ మేమిద్దరం చిన్నప్పుడే కాంట్రాక్ట్ రాసుకుని స్నేహితులుగా ఉందామని అనుకోలేదు. స్నేహ బంధం నిలబడాలంటే, కొన్ని ధరించాలి. మరి కొన్ని భరించాలి. ఇదొక అలంకారం. అదొక అలంకారం. ఆ రెండూ కలిసి ఉన్నదే మంచి స్నేహం." అని మంచి స్నేహాన్నీ, భార్యా భర్తల సంబంధాన్ని కూడా నిర్వచించారు.

మరొక విశేషం ఏమిటంటే, సదస్సు పూర్తి అయిన మద్రాసు వెనక్కి వెళ్ళిన తరువాత మాకు ముళ్ళపూడి వారి దగ్గరనుంచి ఐదు వేల రూపాయలకు చెక్కు వచ్చింది. ఇదేమిటీ, ఏదైనా పొరపాటు జరిగిందా అని నేను వెంఠనే ఆయనకి ఫోన్ చేశాను.

"అదా! మేమందరం నీ ఆతిధ్యంలో రెండు రోజుల పైగా పెద్ద హోటెల్‌లో ఉన్నాం కదా. ఆ రెండు రోజులూ మా అబ్బాయి వరా (సినీ దర్శకుడు) మాతో ఉండడానికి వచ్చి, మాతో కలిసి భోజనం చేశాడు. వాడి ఖర్చు మీరు పెట్టుకోకూడదు కదా! అందుకూ ఆ ఐదు వేలూనూ. తక్కువైతే చెప్పండి" అన్నారు.

నేను ఆశ్చర్య పోయి, మీ అబ్బాయి మా అబ్బాయి కాదా అనే సెంటిమెంటల్ డైలాగులు కూడా చెప్పి ఎంత బతిమాలినా ఆయన చెక్కు వెనక్కి తీసుకోడానికి ఒప్పు కోలేదు. పైగా "కావాలంటే, మా పోలిసీ గురించి ఫలానా ప్రొడ్యూసర్ని అడుగు. నేను పనిచేసిన అతని సినిమాకి పంపించిన పారితోషికంలో అది గమనించి, పాతిక వేలు వెనక్కి ఇచ్చేశాను. ఎందుకంటే, ఆ సినిమా టైములో నా సిగరెట్ల ఖర్చు అతను ఎందుకు పెట్టుకోవాలీ? అది నా పెర్సనల్ ఖర్చు కదా?" అని వివరణ కూడా ఇచ్చారు రమణ గారు. ఒక గొప్ప మనిషి వ్యక్తిత్వానికి అది ఉదాహరణ.

ఆ నాటి సదస్సు పూర్తి అవగానే బాపు గారు నన్ను పక్కకి పిలిచి "ఈ 2006 సంవత్సరం అంతా వంగూరి వారిదే థేంక్యూ " అన్నారు.

ఆ సంవత్సరమే నేను ఎందుకో కాలిఫోర్నియాలో ముళ్ళపూడివారి అమ్మాయి అనూ ఉండే ఊరు వెళ్ళాను. ఏదో మాటల సందర్భంలో ఆ మాట రమణగారికి చెప్పానేమో నాకు గుర్తు లేదు కానీ, ఆ అమ్మాయీ, ఆమె భర్తా పిల్లలతో సహా నేను ఉన్న మా చిన్నన్నయ్య గారి రెండో కొడుకు, చినబాబు......వాడి అసలు పేరు కూడా నా పేరే...వాడింటికి వచ్చారు నన్ను చూడ్డానికి. నేను కొంచెం ఆశ్చర్య పోయి నేను మీ కెలా తెలుసూ అని అడిగాను. "మా నాన్నగారు మీరు ఇక్కడికి వస్తున్నారని చెప్పి , మిమ్మల్ని కలుసుకోమని చెప్పారు" అని సమాధానం చెప్పింది ఆ అమ్మాయి అనూ. రమణ గారి ఆత్మీయతకి ఇది ఒక ఉదాహరణ.

సరిగ్గా గత ఏడాది మార్చిలో నేనూ, గొల్లపూడి మారుతీ రావుగారూ రమణ గారింట్లో బాపు గారితో సహా నాలుగు గంటలు హాయి, హాయిగా కబుర్లు చెప్పుకున్నాం. అదే ముళ్ళపూడి వెంకట్రావ్ గారిని ఆఖరిసారి చూడ్డం.

"మనకి కామెడీ పర్వా లేదు కానీ, వ్యాపారం ..అంటే కమర్షియల్ వ్యవహారాలు అంతగా తెలీదుగా?" అన్నారు ఒకసారి మా గురువు గారు, ఒక సినిమా వైఫల్యం అవగానే హీరో గారి ధర్మమా అని మార్వాడీ దగ్గర చేసిన అప్పులలో తను ఇరుక్కుపోయిన సందర్భం గుర్తుకు చేసుకుంటూ....

అందుకే ఈ "అమెరి కమర్షియల్ కామెడీ"...ముళ్ళపూడి వెంకట రమణ అనబడే వెంకట్రావ్ గారి దివ్యస్మృతికి అంకితం ...

***

Click here to share your comments on this article